## క్లుప్తంగా

### ఉత్తమ బోధనకు కృషి
#### జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు



**తిరువూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపుదలకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం తిరువూరు డివిజన్‌లోని ఐదు మండలాల జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల హాజరు విషయంలో తగు శ్రద్ధ తీసుకోవాలని, ఉపాధ్యాయులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాల సాధనకు ఇప్పటి నుండే ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్షించారు. ఏఎస్ఓ శంకర్, ఎంఈఓలు పాల్గొన్నారు.

### కేడీసీసీబీ భవనం ప్రారంభం



**చాట్రాయి:** చేతి వృత్తుల వారికి కేడీసీసీ బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయిలో రూ.90 లక్షలతో నూతనంగా నిర్మించిన బ్యాంకు భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకులతో పాటు రైతులకు రుణాలు అందించడంలో కేడీసీసీ బ్యాంకులు ముందుంటున్నాయన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీజీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### సామూహిక లక్ష్మీగణపతి హోమం



**మైలవరం:** మైలవరంలోని శ్రీరేణుక ఎల్లమ్మ త్రిశక్తి పీఠంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సామూహిక లక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ తల్లిని నూతన వస్త్రాలు, పూలమాలలతో భక్తులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మహా పూర్ణాహుతి అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

### ఆక్రమణల గుర్తింపు



**నూజివీడు:** పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో ప్రధాన రహదారి వెంట గత కొంతకాలంగా ఇష్టారాజ్యంగా జరుగుతున్న ఆక్రమణలను నిలువరించేందుకు మున్సిపల్ అధికారులు నడుం బిగించారు. టీపీఓ కె. వెంకటేశ్వరరావు నేతృత్వంలో శుక్రవారం ప్రధాన రహదారికి రెండు వైపులా ఉన్న ఆక్రమణలను రోడ్డును సర్వే చేసి గుర్తించారు. ప్రధాన రహదారి వెంబడి కమ్యూనిటీ అవసరాల నిమిత్తం రిజర్వుడు సైట్‌లను ఉంచగా వాటిని సైతం ఆక్రమించి బిల్డింగులు నిర్మించారు. కమ్యూనిటీ హాలు, స్కూల్ బిల్డింగ్, అంగన్‌వాడీ కేంద్రం తదితర వాటిని నిర్మించాలంటే స్థలం కరువైంది.

### స్వామిత్వ సర్వే పరిశీలన



**విస్సన్నపేట:** గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని డీఎల్‌పీఓ రాఘవన్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక నాలుగవ గ్రామ సచివాలయం వద్ద సర్వేను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ శివకుమార్, పంచాయతీ ఈఓ హరికృష్ణకుమార్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 60 కంప్యూటర్లు అందజేత

**మైలవరం:** మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సెంట్రల్ గవర్నమెంట్ గ్రాంట్ పీఎం ఉష నిధులు కింద 60 కంప్యూటర్లను శుక్రవారం అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. గతంలో కళాశాలలో 60 కంప్యూటర్లు ఉన్నాయని, కొత్తగా ఇచ్చిన వాటితో మొత్తం 120 కంప్యూటర్లు ఉన్నాయన్నారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ విభాగంలో 40 ల్యాప్ ట్యాప్‌లు ఉన్నాయని, కళాశాలలో ప్రతి ఐదుగురు విద్యార్థులకు ఒక కంప్యూటర్, ఇంటర్‌నెట్ అందుబాటులో ఉందని ప్రిన్సిపాల్ వివరించారు.

# సమస్యల హాస్టేలు

- శిథిలావస్థలో మైలవరం ఎస్సీ బాలికల వసతిగృహం
- పెచ్చులూడిపడుతున్న భవనం శ్లాబ్
- వందమందికి పైగా విద్యార్థినులకు వసతి
- ప్రైవేటు భవనంలోకి తరలింపుపై మీనమేషాలు

**మైలవరం(జి.కొండూరు):** దశాబ్దాల క్రితం నిర్మించిన వసతి గృహాల భవనాలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారాయి. మైలవరం సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతిగృహం భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. బాలికలను అక్కడి నుంచి తరలించడంలో గత కొన్ని నెలలుగా చూపుతున్న నిర్లక్ష్యం పేద విద్యార్థులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుతోంది.



మైలవరంలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతిగృహం

#### కూలే దశలో వసతిగృహం

మైలవరంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతిగృహాన్ని నిర్వహిస్తున్న భవనం 1986లో నిర్మించి ప్రారంభించారు. మూడున్నర దశాబ్దాల వయస్సు గల ఈ వసతిగృహం గోడలు బీటలు వారి శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. వసతి గృహంలో ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతి వరకు 105 మంది విద్యార్థినులు వసతి పొందుతూ స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. వసతిగృహం ఎప్పుడు కూలుతుందోనని బాలికలు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడిన సమయంలో శ్లాబు, గోడల నుంచి నీరు కారుతుండటంతో బాలికలు నరకయాతన పడుతున్నారు. ఎప్పుడు పెచ్చులూడి మీద పడతాయోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

#### తరలింపుపై మీనమేషాలు..

శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి పీఎం ఏజేఏవై పథకం కింద రూ.3 కోట్లు కూడా మంజూరైనట్లు తెలుస్తోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు వాయిదా పడుతున్నాయి. ఈ లోగా భవనం కూలే అవకాశం ఉన్నందున విద్యార్థినులను ప్రైవేటు భవనంలోకి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ అద్దె రూపంలో మరో తలనొప్పి ఎదురైంది. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం చదరపు అడుగు భవనానికి రూ.6 చొప్పున మాత్రమే అద్దె చెల్లిస్తారు. ఈ అద్దెకు ప్రైవేటు భవనాలను ఇచ్చేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో తరలింపు ఆలస్యమవుతోంది. ప్రభుత్వం స్పందించి అద్దె పెంచి ఇస్తే విద్యార్థుల తరలింపు వెంటనే జరిగిపోయే అవకాశం ఉంది. అలా కాకుండా ప్రభుత్వం జాప్యం చేస్తే వసతిగృహం భవనం కూలిపోయి బాలికల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది.

#### వసతులు అంతంత మాత్రమే..

వసతిగృహంలో ఎనిమిది మరుగుదొడ్లు ఉన్నప్పటికీ కొన్నింటికి డోర్లు కూడా సక్రమంగా లేకపోవడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. బెడ్లు లేకపోవడంతో కిందనే పడుకోవాల్సి వస్తోంది. వర్షం కురిసిన సమయంలో భవనం నుంచి లీకైన నీరు కిందకు వస్తే పడుకునేందుకు కూడా వీలు లేక నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. వసతి గృహానికి ఉన్న గేట్లు కూడా తుప్పుపట్టిపోవడంతో బాలికల రక్షణ అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. వసతి గృహంలో లెక్కకు 105 మంది బాలికలు ఉన్నప్పటికీ భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోననే భయంతో కొంతమంది బాలికలు వసతిగృహానికి రావడానికి కూడా ఇష్టపడకపోవడంతో డైలీ హాజరు తగ్గిపోతుంది.



బీటలు వారిన వసతిగృహం గోడ



వసతి గృహం వరండాలో పెచ్చులూడిన శ్లాబు



వసతి గృహంలో విరిగిపోయిన తలుపులతో మరుగుదొడ్లు

#### బాలికల వసతిగృహంపై నిర్లక్ష్యం తగదు



మైలవరం ఎస్సీ బాలికల వసతిగృహంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే బాలికల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. వసతిగృహం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థినులను అక్కడి నుంచి తరలించి నూతన భవనాన్ని నిర్మించాలి.

– కావ్య,
ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు, మైలవరం

#### విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు



మైలవరం ఎస్సీ బాలికల వసతిగృహం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియదు. అటువంటి భవనంలో వంద మందికిపైగా పేద విద్యార్థినులను ఉంచడం దారుణం. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థినులను అక్కడి నుంచి తరలించకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– వై.నంద సాయి కిశోర్‌రెడ్డి,
వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

#### తరలింపు కోసం భవనాలను పరిశీలిస్తున్నాం

వసతిగృహం భవనం శిథిలావస్థకు చేరింది. విద్యార్థినులను తరలించేందుకు ఇప్పటికే కొన్ని భవనాలను చూశాం. అద్దె చెల్లింపు విషయమై వ్యత్యాసం ఉండటం వల్ల ఆలస్యమవుతోంది. త్వరలో భవనాన్ని ఎంపిక చేసి విద్యార్థినులను తరలిస్తాం. ప్రస్తుతానికి బాలికలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– అలివేలు మంగమ్మ,
వార్డెన్, సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహం

## కూటమి మోసాలను వివరించండి

#### వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

**తిరువూరు:** ప్రజాబలం లేకపోయినా అడ్డదారిలో గెలుపునకు వందలాది వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల్ని నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరు పట్టణంలోని 12, 16 వార్డులలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్వామిదాసు మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో పాటు వందలాది హామీలిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తూతూ మంత్రంగా అమలు చేయడం శోచనీయమన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి పథకాల అమలు ఎప్పుడో చెప్పలేకపోతున్నారని, అన్ని హామీలు అమలుపరిచేవరకు వైఎస్సార్ సీపీ ప్రశ్నిస్తూనే ఉంటుందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గుంతల రోడ్లు లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి పాలకులు ఒకసారి రోడ్ల దుస్థితిని కళ్లారా చూడాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్ సీపీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు తెలియజేయాలని కార్యకర్తలకు సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, పాలం రమాదేవి, గుమ్మా వెంకటేశ్వరి, ఏరువ ప్రకాష్‌రెడ్డి, బీసీ విభాగ రాష్ట్ర కార్యదర్శి కాలసాని గోపాల నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, నాయకులు తిరుమలశెట్టి వేణుబాబు, నాగుల్‌మీరా, జాకీర్, చెన్నారావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, షేక్ అజీజ్, అంబటి వెంకట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్న స్వామిదాసు, నాయకులు

**ముష్టికుంట్లలో..**

**తిరువూరురూరల్:** మండలంలోని ముష్టికుంట్లలో శుక్రవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. క్యూఆర్ కోడ్‌తో బాబు మోసాలను తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి నవీన్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నాయకులు గద్దె అంజయ్య, సీతారామయ్య, చెన్నుకృష్ణప్రసాద్, మామిడి కుటుంబరావు, రామారావు, రాంబాబు, గుడిపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక కుంకుమార్చనలు

**తిరువూరు:** శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ సంధ్య, చైర్మన్ కావూరి శశిరేఖ పర్యవేక్షించారు. తిరువూరు కోదండరామాలయం, అష్టలక్ష్మీ ఆలయం, పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయం, శ్రీవేంకటాచలస్వామి దేవస్థానం, రంగనాయకస్వామి ఆలయాల్లో శ్రావణ శుక్రవార పూజలు, కుంకుమార్చనలు జరిగాయి.

- **ముసునూరు:** చెక్కపల్లి శ్రీకృష్ణాలయం వద్ద అమ్మవారికి మహిళలు పెద్ద సంఖ్యలో పూజాదికాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనరు కోటేశ్వరరావు, కో-కన్వీనరు గిరిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.
- **ఆగిరిపల్లి:** తోటపల్లిలోని దుగ్గిరాల బాలరామ తల్లిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు. ఆగిరిపల్లిలోని కనకదుర్గా దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముక్తేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. దుగ్గిరాల బాలరావమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పాల పొంగళ్లు సమర్పించారు.

## ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

**ఆగిరిపల్లి:** ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని జిల్లా రవాణా అధికారి షేక్ షబ్నం అన్నారు. శుక్రవారం ఆగిరిపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని వసతులను ఆమె పరిశీలించారు. త్వరలో ఆగిరిపల్లి బస్టాండ్‌లో ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని, బస్టాండ్‌ను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్‌కు బస్సును ఏర్పాటు చేశామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

- **నూజివీడు:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కింద ఏలూరు జిల్లాలో ఏర్పాటు చేసిన 177 సర్వీసుల ద్వారా ఇంతవరకు 2,60,957మంది మహిళలు ప్రయాణించారని డీపీటీఓ షేక్ షబ్నం తెలిపారు. నూజివీడు ఆర్టీసీ డిపోను శుక్రవారం సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నూజివీడు-మైలవరం రూట్‌లో మూడు హైర్ బస్సులు తిరుగుతున్నాయని, రోడ్డు బాగోకపోవడంతో కొన్ని సర్వీసులు రద్దవుతున్నాయని చెప్పారు.




నూజివీడు డిపోలో బస్‌లను పరిశీలిస్తున్న డీపీటీఓ షబ్నం

### శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

**నూజివీడు:** పెదవేగి మండలం కొండలరావుపాలెంలో జరిగిన ఘర్షణలో పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసినట్లు నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సెక్షన్ 30 యాక్ట్ అమలుకు కృషి చేసినట్లు చెప్పారు. పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం తగదన్నారు.

## ప్రమాదకరంగా అప్రోచ్

**జి.కొండూరు:** బుడమేరుకు ఇటీవల వచ్చిన వరద ప్రవాహానికి హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై నిర్మించిన లోలెవెల్ చప్టాకు కందులపాడు గ్రామం వైపు అప్రోచ్ రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. గతంలో పలుమార్లు ఈ అప్రోచ్ కోతకు గురై తూములు సైతం వరదకు కొట్టుకుపోయినప్పటికీ కాంక్రీట్ వాల్ నిర్మించకుండా మట్టితో సరిపెట్టడంతో మరలా అదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఉన్న పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో హై లెవెల్ వంతెన నిర్మాణం చేపట్టే వరకు లోలెవెల్ చప్టాను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ లోలెవెల్ చప్టాకు అప్రోచ్ ప్రమాదకరంగా మారడంతో ఏ క్షణంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అప్రోచ్‌ను బలోపేతం చేయాలని కోరుతున్నారు.



హెచ్.ముత్యాలంపాడు వద్ద బుడమేరుపై ఉన్న చప్టాకు కందులపాడు వైపు కోతకు గురైన అప్రోచ్ రోడ్డు

### 25న దేవస్థానం షాపుల వేలం

**విస్సన్నపేట:** పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన 1,2,3,7,8 షాపులలో పూజాద్రవ్యాలు, ఇతర వ్యాపారాలు చేసుకునేందుకు అద్దె హక్కునకు ఈ నెల 25న వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వీడీడీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాల పొంగళ్లకు గ్యాస్ పొయ్యిల అద్దె హక్కునకు దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగలవారు దేవస్థానం కార్యాలయం వద్ద సంప్రదించాలని ఈఓ పేర్కొన్నారు.

### ఆయిల్ పామ్ రైతులకు ఉచితంగా మొక్కలు

**మైలవరం:** ఆయిల్ పామ్ తోటలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు పతంజలి ఫుడ్స్ సంస్థ ద్వారా మొక్కలు ఉచితంగా అందిస్తున్నామని ఉద్యాన శాఖ జిల్లా అధికారి పి. బాలాజీకుమార్ తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో కొనిదేన భార్గవ్‌కుమార్ పొలంలో ప్రత్యేక ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా సూక్ష్మసేద్య అధికారి పీఎం సుభాని, రైతులు, పతంజలి ఫుడ్స్ సంస్థ యాజమాన్యం, గ్రామ ఉద్యాన సహాయకులు నాగసురేంద్ర, శేషు తదితరులు పాల్గొన్నారు.

### నూజివీడు ఇన్‌చార్జి డీవైఈఓగా పీఎస్ సుధాకర్



**నూజివీడు:** నూజివీడు ఇన్‌చార్జి డివిజినల్ విద్యాశాఖాధికారి (డీవైఈఓ)గా పాటిబండ శ్రీకాంత్ సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీవైఈఓకు డివిజన్‌లోని పలు హైస్కూళ్లలో పనిచేస్తున్న పీఈటీలు, పీడీలు, హెచ్ఎంలు శుభాకాంక్షలు తెలిపారు.

### నటనలో చిరు నూతన ఒరవడి

**మైలవరం:** మైలవరంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద మైలవరం కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ చిరంజీవి తన నటనలో నూతన ఒరవడి సృష్టించారని, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త అక్కల రామ్మోమనరావు, కఠారి ఉమామహేశ్వరరావు, మైలవరం సొసైటీ డైరెక్టర్ కరెడ్ల వెంకట నారాయణ, సాగా వెంకటేశ్వరరావు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

### బాధ్యతలు చేపట్టిన త్రిసభ్య కమిటీ సభ్యులు

**మైలవరం:** మైలవరం మండలం వెల్వడం గ్రామ సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సొసైటీ చైర్మన్‌గా పురమ సతీష్ కుమార్, కమిటీ సభ్యులుగా జి. ఆంజనేయులు, పి. వినోదరావు బాధ్యతలు స్వీకరించారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నవరాత్రి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి: ఆర్డీఓ

**తిరువూరు:** గణపతి నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ముందస్తు అనుమతి తీసుకోవాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ నవరాత్రి పందిళ్ల ఏర్పాటుకు ఆన్‌లైన్లో సింగిల్ విండో విధానంలో అనుమతులు తీసుకోవాలని, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల నుంచి అనుమతి తప్పనిసరన్నారు. నిమజ్జన కార్యక్రమంలో నిబంధనలు పాటించాలని కోరారు. నియోజకవర్గంలోని వివిధ శాఖల గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### వేడినీటి కాలువ గండి పూడ్చివేత

**ఇబ్రహీంపట్నం:** ఖాజీమాన్యంలో ఎన్టీటీపీఎస్ వేడినీటి కాలువకు పడిన గండి పూడ్చివేత పనులు శుక్రవారం చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువ కట్టకు గండి పడింది. మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు కాలువకు గండి పడిన ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా మట్టి తోలించి జేసీబీతో చదును చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.43.45 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డుకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కొండపల్లి మున్సిపాలిటీలో జెడ్పీ హైస్కూల్ నుంచి ఎర్ర బ్రిడ్జి హైవే వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం జరుపనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నేత్ర వైద్య సేవలు

**మైలవరం:** లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం, లయన్స్ ఇంటర్నేషనల్ పీడీజీ డాక్టర్ వై. జగన్‌మోహనరావు మెమోరియల్ చైల్డ్ కేర్ సౌజన్యంతో మైలవరంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, వివేకానంద హైస్కూల్, ఎస్ఏసీ హైస్కూల్‌లోని 1600 మంది విద్యార్థులకు శుక్రవారం ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలను ఎంఈఓ ఎల్. బాలు ప్రారంభించారు. వీరిలో 150 మంది విద్యార్థులకు అవసరమైన కళ్లజోళ్లు త్వరలో అందజేస్తామని ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు తెలిపారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### రెండో రోజూ క్వాంటం వ్యాలీ హ్యాకథాన్

**మైలవరం:** క్రిప్టోగ్రఫీ, కృత్రిమ మేధస్సు వంటి రంగాలలో విద్యార్థులు అవకాశాలను అన్వేషించాలని ఐబీఎం క్వాంటమ్ ప్రతినిధి వెంకట్ సుబ్రహ్మణ్యం అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 ఆల్ ఇండియా ఆన్‌లైన్ బూట్ క్యాంప్ శుక్రవారం రెండో రోజుకు చేరింది. దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 20 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ బూట్ క్యాంప్ విద్యార్థులకు అభ్యాసం, సహకారం, ఆవిష్కరణలకు జాతీయ వేదికగా నిలుస్తూ రేపటి సాంకేతిక దిశను నిర్వచించే సరికొత్త పరిష్కారాలను ఆవిష్కరించేలా ప్రేరణనిస్తుందన్నారు. కళాశాల నుంచి 180 మంది క్వాంటం థింకర్స్, 13 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

### యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

**తిరువూరురూరల్:** ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల దుకాణ డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ హెచ్చరించారు. మండలంలోని పెద్దవరం, వావిలాల గ్రామాల్లో ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు.
దుకాణాల వద్ద ఎరువుల స్టాకు వివరాలు, ధరల పట్టిక ప్రదర్శించాలని, ఈపోస్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరిపి, రైతుకు బిల్లు ఇవ్వాలని ఆదేశించారు.

### రోడ్డుపై మురుగునీటి తిష్ట



**నూజివీడు:** స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని బాత్‌రూమ్‌ల నీరు ఎమ్మార్‌అప్పారావు కాలనీకి వెళ్లే తారు రోడ్డు వెంట నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెందుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో సమారు ఐదు వేలకు పైగా జనాభా నివసిస్తోంది. వీరంతా పట్టణానికి వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి. మురుగునీరు రోడ్డుపైకి రావడం, వాహనాల వెళ్లేటప్పుడు ఆ నీరు చింది అదే మార్గంలో వెళ్తున్న వారిపై పడుతోందని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.